సాక్షి ఒడిశా

గురువారం । 20 । మార్చి । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం బుధవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,76,935లు, వెండి 42 గ్రాముల 700 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



కాంగ్రెస్ గర్జన

కాంగ్రెస్ ఎమ్మెల్యేల తీరుతో శాసన సభ బడ్జెట్ సభా కార్యకలాపాలకు తీవ్ర అంతరాయం కలిగింది. పలు మార్లు సభ వాయిదాపడింది.

- 8లో.



ముగిసిన శ్రామిక్ కాంగ్రెస్ నిరసన

తూర్పుకోస్తా రైల్వేశ్రామిక్ కాంగ్రెస్ చేపట్టిన నిరసన కార్యక్రమం బుధవారంతో ముగిసింది. డిమాండ్లు తీర్చాలని నేతలు నినాదాలు చేశారు.

- 8లో.

న్యూస్‌రీల్

రైలు నుంచి జారిపడి వలస కార్మికుడి మృతి



భరేంద్ర (ఫైల్)

రాయగడ: కైకలూరు–భీమవరం రైల్వేస్టేషన్ మధ్య ట్రెన్ నుంచి ప్రమాదవశాత్తు జారిపడి ఓ వలస కార్మికుడు మృతి చెందాడు. మృతుడు సదరు సమితి పరిధిలోని పిపలగుడ పంచాయతీ కొడాపాడు గ్రామానికి చెందిన భరేంద్ర కొండగిరి(40)గా గుర్తించారు. నెల రోజుల క్రితం ఉపాధి కోసం మిత్రులతో కలిసి ఆంధ్రప్రదేశ్‌లోని గుడివాడకు వెళ్లాడు. పనులు ముగించుకుని మంగళవారం రైలులో ఇంటికి బయలుదేరాడు. కైకలూరు –భీమవరం రైల్వే స్టేషన్ మధ్య ప్రమాదవశాత్తు జారిపడి ప్రాణాలు కోల్పోయాడు. గేటు వద్ద నిల్చుని ఉండగా జారిపడినట్లు తెలిసింది. మృతదేహాన్ని బుధవారం స్వగ్రామానికి తీసుకొచ్చి దహన సంస్కారాలు పూర్తి చేశారు.

రత్న భాండాగారం తాళం గల్లంతు

- ప్రభుత్వ వివరణ కోరిన రాష్ట్ర హైకోర్టు
- వచ్చే వారం తదుపరి విచారణ

భువనేశ్వర్: పూరీ జగన్నాథుని రత్న భాండాగారం తాళాల గల్లంతు వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. ఈ వివాదంపై ప్రభుత్వం న్యాయ విచారణకు ఆదేశించిన విషయం విదితమే. రత్న భాండాగారం తాళాల గల్లంతుపై జరిగిన న్యాయ విచారణ నివేదికని బహిరంగపరచాలని రాష్ట్ర హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రెండు సార్లు అఫిడవిట్లు దాఖలు చేసింది. ఈ రెండింటిలో భిన్నాభిప్రాయాలు వ్యక్తీకరించడంతో సందిగ్ధత నెలకొంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఖరారు చేయాలని రాష్ట్ర ఉన్నత న్యాయ స్థానం ఆదేశాలు జారీ చేసింది. గత ఏడాది జనవరి 29న ధర్మాసనానికి సమర్పించిన అఫిడవిట్‌లో రత్న భాండాగారం తాళాల గల్లంతుపై న్యాయ విచారణ నివేదికను బహిరంగపరచకూడదని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. అదే సంవత్సరం ఏప్రిల్ 5న దాఖలు చేసిన రెండవ అఫిడవిట్‌లో, ప్రభుత్వం నివేదికను బహిరంగపరచడానికి అంగీకరించిందని పేర్కొంది. బుధవారం కొనసాగిన విచారణ పురస్కరించుకుని హైకోర్టు రెండు అఫిడవిట్లపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత కోరింది. ఈ కేసు తదుపరి విచారణ వచ్చే వారం జరగనుంది. ఈ అంశంపై భారతీయ జనతా పార్టీ అప్పటి బిజూ జనతా దళ్ ప్రభుత్వంపై మండిపడిన సంగతి తెలిసిందే. గత ఏడాది ముగిసిన సార్వత్రిక ఎన్నికలలో బీజేపీ ఈ అంశాన్ని ప్రధాన ఎన్నికల ప్రచార అస్త్రంగా సంధించింది. ప్రభుత్వ వైఫల్యం, నిర్లక్ష్యాన్ని ఎండగట్టి ఎన్నికల్లో ఘన విజయం సాధించి తొలి సారిగా పాలన పగ్గాలు చేపట్టింది. ఎన్నికల ప్రచారంలో తమ పార్టీ అధికారంలోకి వస్తే రత్న భాండాగారం తాళాలు గల్లంతు వ్యవహారం నిగ్గు తేల్చుతామని బీజేపీ ప్రకటించిన సంగతి తెలిసిందే.

అబ్కారీ దాడులపై ఆగ్రహం



బొరిగుమ్మ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసిన గ్రామస్తులు

జయపురం: జాముండ గ్రామంలో గ్రామ పెద్ద బి.దంతేశ్వరరావు ఇంట్లో నాటుసారా ఉందంటూ బొరిగుమ్మ అబ్కారీ విభాగం అధికారులు, సిబ్బంది దాడులు చేయడంపై గ్రామస్తులు భగ్గుమన్నారు. అందరినీ కొట్టి భయంకర వాతావరణం సృష్టించడం తగదంటూ మండిపడ్డారు. ఈ ఘటనపై గ్రామస్తులంతా కలిసి బొరిగుమ్మ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దాడి జరిపిన సిబ్బందిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.





కొరాపుట్ జిల్లా ప్రజలకు ధన్యవాదాల లేఖ విడుదల చేసిన రాజమౌళి, ప్రియాంక చోప్రా

ధింక్యా.. కొరాపుట్



1. నిర్మానుష్యంగా తులమాలి పర్వత ప్రాంతం
2. షూటింగ్ ముగియడంతో సేద తీరుతున్న సినీ యూనిట్
3. తనకు భద్రత కల్పించిన స్థానిక పోలీసులతో రాజమౌళి

- జిల్లాలో ముగిసిన ఎస్ఎస్ఎంబీ-29 చిత్రం షెడ్యూల్
- ధన్యవాదాలు తెలుపుతూ లేఖ విడుదల చేసిన రాజమౌళి, ప్రియాంక చోప్రా
- మహేష్‌బాబుతో ఫొటోలు దిగిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు
- రాజమౌళికి మిలెట్స్ బహూకరించిన సీఎల్‌పీ నేత రామ్‌చంద్ర ఖడం



సీఎల్‌పీ నేత రామ్‌చంద్ర ఖడం, నాయకులతో రాజమౌళి

కొరాపుట్:

పాన్ ఇండియా దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి, సూపర్ స్టార్ మహేష్‌బాబు, ప్రియాంకచోప్రా కాంబినేషన్‌లో రూపొందుతున్న 'ఎస్ఎస్ఎంబీ-29'(వర్కింగ్ టైటిల్) చిత్రానికి సంబంధించి కీలక షెడ్యూల్ షూటింగ్ కొరాపుట్ జిల్లాలో ముగిసింది. నెల రోజులుగా ఈ ప్రాంతంలో షూటింగ్ జరుగుతుండటంతో సందడి వాతావరణం నెలకొంది. మంగళవారంతో షెడ్యూల్ ముగియడంతో అదే రోజు రాత్రి కొంతమంది నటీనటులు, సిబ్బంది వెనుదిరగగా.. బుధవారం ఉదయం రాజమౌళి, ప్రియాంకచోప్రా, మిగిలిన సాంకేతిక బృందం వీడ్కోలు పలికింది. షెడ్యూల్ ముగిసిందనే సమాచారం తెలుసుకున్న పరిసర ప్రాంత అభిమానులు వేకువజామునే కొరాపుట్ జిల్లా సిమిలిగుడ పట్టణంలో రాజమౌళి బృందం బస చేసిన హోటల్‌కు పోటెత్తారు. సిమిలిగుడ ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రియాంక చోప్రాతో కలిసి ఫొటోలు దిగారు.

కదిలిన కాంగ్రెస్ శ్రేణులు..

షెడ్యూల్ మొత్తం పొట్టంగి నియోజకవర్గంలోనే జరిగింది. ఈ స్థానం నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యే రామ్‌చంద్ర ఖడం నేతృత్వం వహిస్తున్నారు. ఆయన ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ శాసన సభాపక్ష నేతగా ఉన్నారు. దాంతో ఖడం నేతృత్వంలో కాంగ్రెస్ నాయకులు, సర్పంచ్‌లు, జిల్లా పరిషత్ సభ్యులు పెద్ద ఎత్తున షూటింగ్ స్పాట్‌కు చేరుకున్నారు. కొరాపుట్ జిల్లాలో పండించిన నల్ల ధాన్యం, కొరాపుట్ కాఫీ తదితర మిలెట్స్‌తో కూడిన బాక్స్‌ను రాజమౌళికి బహూకరించారు. మరోసారి ఇదే ప్రాంతంలో షూటింగ్‌కి రావాలని ఆహ్వానించారు. ఎప్పుడు ఎవరు షూటింగ్‌కు వచ్చినా తాము పూర్తిస్థాయిలో సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. మరోసారి ఈ ప్రాంతానికి తన సినిమా షూటింగ్ కోసం వస్తానని రాజమౌళి బదులిచ్చారు.

వీడ్కోలు పలికిన అధికారులు..

రాజమౌళి బృందానికి వీడ్కోలు పలకడానికి పెద్ద ఎత్తున ఉన్నతాధికారులు తరలివచ్చారు. కొరాపుట్ జిల్లా ఎస్పీ రోహిత్ వర్మ, ట్రైనీ ఐఏఎస్ జయపూర్ సబ్ కలెక్టర్ అక్కవరపు సశ్యా రెడ్డి, జయపూర్ ఎస్‌డీపీఓ పార్థో జగదీష్ కశ్యప్‌లు రాజమౌళి బృందాన్ని కలిశారు. అనంతరం మహేష్‌బాబు ఉంటున్న దేవమాలి కాటేజీకి వెళ్లి ఫొటోలు దిగారు.

ఆదరణ మరువలేం..

చివరిలో రాజమౌళి, ప్రియాంక చోప్రాలు ప్రత్యేకంగా లేఖ విడుదల చేశారు. ఇక్కడి ప్రజల సహకారం, స్నేహశీలత మరువలేమన్నారు. ఆ లేఖను ఐఏఎస్ అధికారి సశ్యా రెడ్డికి అందజేసి ఎక్స్ వేదికగా ప్రకటించారు. తమకు ఇన్ని రోజులు భద్రత కల్పించిన పోలీసులకు స్వయంగా కృతజ్ఞతలు తెలిపారు. కాగా, గత నెల రోజులుగా వాహనాలు, వేలాది మంది సందర్శకులతో కళకళలాడిన తులమాలి పర్వత ప్రాంతం బోసిపోయింది. సినిమా యూనిట్ వాహనాలు తిరిగి వెళ్లిపోవడంతో ఆ ప్రాంతమంతా నిర్మానుష్యంగా మారింది. సిమిలిగుడ పట్టణంలో ఒక్కసారిగా హోటళ్లలో సందర్శకుల తాకిడి తగ్గింది.



లేఖపై సంతకం చేస్తున్న రాజమౌళి

నెరవేరనున్న కల..



తాత్కాలిక భవనంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ తదితరులు

- 22న జయపురంలో కేంద్రీయ విద్యాలయం ప్రారంభం
- వర్చువల్ ద్వారా ప్రారంభించనున్న కేంద్ర మంత్రులు

జయపురం: జయపురం ప్రాంత ప్రజల కోరిక నేరవేరబోతుంది. ఎప్పటి నుంచి ఎదురుచూస్తున్న కేంద్రీయ విద్యాలయం ఈ నెల 22న ప్రారంభంకానుంది. దీన్ని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, కేంద్ర విద్యాశాఖమంత్రి ధర్మేంద్రప్రధాన్, ఒడిశా ముఖ్యమంత్రి మోహన చరణ మఝిలు వర్చువల్ ద్వారా ప్రారంభిస్తారు. ప్రస్తుతం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో దీన్ని నిర్వహిస్తారు. ఈ విద్యా ఏడాదిలో కేంద్ర విద్యాలయంలో చదువులు ప్రారంభించనున్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రారంభం తరువాత విద్యాలయంలో చేరేందుకు దరఖాస్తులు స్వీకరించనున్నారు.

అధికారుల పరిశీలన..

కొరాపుట్ జిల్లా కలెక్టర్ వి.కీర్తివాసన్, జయపురం సబ్‌కలెక్టర్ కుమారి ఎ. శోశ్య రెడ్డి, కొరాపుట్ కేంద్ర విద్యాలయ ప్రిన్సిపాల్ సరోజ్ కుమార్ దాస్, జయపురం సమగ్ర గిరిజనాభివృద్ధి విభాగ జూనియర్ ఇంజినీర్ చయిత బాస్కె తదితరులు బుధవారం కేంద్రీయ విద్యాలయంలో ఏర్పాట్లను పరిశీలించారు. తాత్కాలిక కేంద్ర విద్యాలయాన్ని జయపురం సమగ్ర గిరిజనాభివృద్ధి విభాగం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్మించింది. అందులో 15 గదులు ఉండగా.. వీటిని ఉన్నతాధికారులు పరిశీలించారు. భవనానికి రంగులు వేసి అందంగా తయారు చేస్తున్నారు. ఈ నెల 22న సంబల్‌పూర్ నుంచి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్, భువనేశ్వరన్ నుంచి ఒడిశా ముఖ్యమంత్రి మోహణ చరణ మాఝి లు వర్చువల్‌గా విద్యాలయాన్ని ప్రారంభిస్తారు. ప్రస్తుతానికి ఐదో తరగతి వరకు తరగతులను నిర్వహించనున్నారు. ఒక్కో తరగతిలో 40 మంది విద్యార్థులకు ప్రవేశం ఉంటుందని నోడల్ అధికారి, కొరాపుట్ కేంద్ర విద్యాలయ ప్రిన్సిపాల్ సరోజ్ కుమార్‌దాస్ వెల్లడించారు. దరఖాస్తు ఫారాలు ఆఫ్‌లైన్‌లో స్వీకరిస్తామన్నారు.



కేంద్రీయ విద్యాలయం కోసం సిద్ధం చేసిన భవనం

ఇంటింటా విద్యా ప్రచారం



ప్రచారం చేస్తున్న కౌన్సిలర్ రంజితా పండా

కొరాపుట్: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన శిశు బటిక పథకంపై ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్నారు. బుధ వారం నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలో మున్సిపల్ కౌన్సిలర్లు స్థానిక ప్రభుత్వ ఉపాధ్యాయులతో కలిసి ప్రచారం చేపట్టారు. ఏప్రిల్ 2 నుంచి ఈ పథకంలో భాగంగా ఐదేళ్లు నిండిన చిన్నారులను సమీప పాఠశాలల్లో తప్పక చేర్పించాలంటూ కరపత్రాలు పంచిపెట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కునునాయక్, కౌన్సిలర్ రంజితా పండా పాల్గొన్నారు.

వ్యోమగాములకు అభినందనలు

భువనేశ్వర్: సురక్షితంగా భూమికి తిరిగి వచ్చిన నాసా క్రూ–9 వ్యోమగాములు సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్‌కు రాష్ట్ర గవర్నర్ డాక్టరు హరిబాబు కంభంపాటి, ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి తదితర ప్రముఖులు ప్రత్యేకంగా అభినందించారు. వారి అంకితభావం అందరికీ స్ఫూర్తిగా నిలుస్తుందని కొనియాడారు.

దాస్ హత్యపై సీబీఐ దర్యాప్తు చేపట్టాలి

భువనేశ్వర్: దివంగత రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి నవకిషోర్ దాస్ హత్యా సంఘటనపై సీబీఐ దర్యాప్తు చర్యకు ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి అనుమతించారు. మంత్రి కుటుంబ సభ్యులు బుధవారం స్థానిక లోక్‌సేవా భవన్‌లో సీఎంను కలిశారు. నవకిషోర్‌దాస్ భార్య మీనతిదాస్ లిఖితపూర్వక అభ్యర్థన మేరకు ముఖ్యమంత్రి ఈ అనుమతి జారీ చేశారు.

క్రైంశాఖ పునఃదర్యాప్తు..

బుధవారం రెండో రోజు క్రైంశాఖ పునఃదర్యాప్తు నిరవధికంగా కొనసాగింది. ఇద్దరు క్రైమ్‌శాఖ దర్యాప్తు బృందం దివంగత మంత్రి ఇంటికి చేరుకుని కుటుంబీకులను ప్రశ్నించింది.వారి వాంగ్మూలం నమోదు చేసినట్లు క్రైమ్ శాఖ అధికారి తెలిపారు. రెండో రోజున హత్య తదనంతర తక్షణ కార్యాచరణపై దర్యాప్తు బృందం లోతుగా విచారణ చేపట్టినట్లు సమాచారం. ఆస్పత్రికి తరలించి అక్కడ నుంచి ఎయిర్ అంబులెన్సులో రవాణా తదితర అనుబంధ కార్యాచరణపై దర్యాప్తు చేపట్టారు.

సీబీఐ దర్యాప్తు కోసం ఒత్తిడి తెస్తా: జయ నారాయణ మిశ్రా

నవ కిషోర్ దాస్ హత్యా సంఘటనపై సీబీఐ దర్యాప్తు కోసం అభ్యర్థిస్తున్నానని బీజేపీ ఎమ్మెల్యే మిశ్రా తెలిపారు. దివంగత మంత్రి కుటుంబీకులతో చర్చించేందుకు ముఖ్యమంత్రి అనుతించిన నేపథ్యంలో సీబీఐ దర్యాప్తు కోసం అభ్యర్థిస్తే తన వంతుగా కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి సీబీఐ దర్యాప్తు కోసం ఒత్తిడి చేస్తానని ప్రకటించారు. ఇప్పటికే ఈ వ్యవహారంలో జాప్యం చోటు చేసుకుందని చెప్పారు.



సీఎంతో నవ కిశోర్‌దాస్ కుటుంబ సభ్యులు

లిఖితపూర్వక అభ్యర్థన అవాంఛనీయం: బీజేడీ

నవ కిషోర్ హత్య సంఘటనపై సీబీఐ దర్యాప్తు కోసం కుటుంబీకుల నుంచి లిఖితపూర్వక అభ్యర్థన అవాంఛనీయమని ప్రధాన విపక్షం బిజూ జనతా దళ్ నాయకుడు డాక్టరు ప్రసన్న కుమార్ ఆచార్య విచారం వ్యక్తం చేశారు. ఈ మేరకు దివంగత మంత్రి కుటుంబీకులకు సీబీఐ విచారణకు పదే పదే లేఖలు రాయమని ఎందుకు అడుగుతున్నారు? అని నిలదీశారు. సీబీఐ విచారణకు ఎలాంటి లిఖితపూర్వక అభ్యర్థన అవసరం లేదని స్పష్టం చేశారు.

దొందూదొందే: కాంగ్రెసు

దివంగత మంత్రి హత్య ఘటన విచారణ, దర్యాప్తు వ్యవహారంలో ఉభయ బిజూ జనతా దళ్, భారతీయ జనతా పార్టీ దొందూ దొందే అన్నట్లు కాలక్షేపం చేస్తున్నాయని ఒడిశా ప్రదేశ్ కాంగ్రెసు కమిటీ అధ్యక్షుడు భక్త చరణ్ దాస్ వ్యాఖ్యానించారు.

సీఎంను కలిసిన మాజీ మంత్రి కుటుంబీకులు

భువనేశ్వర్: ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝిని దివంగత మంత్రి నవ కిషోర్ దాస్ కుటుంబ సభ్యులు బుధవారం కలిశారు. సీబీఐ విచారణ కోసం అభ్యర్థన లేఖను సమర్పించారు.

ప్రైవేటు బస్సు బోల్తా



క్షతగాత్రులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే సదాశివ ప్రదాని తదితరులు



బస్సులో ప్రయాణికుడి మృత దేహం



బోల్తా పడిన బస్సు

కొరాపుట్: ప్రైవేట్ బస్సు బోల్తా పడిన ఘటనలో ఒకరు మృతి చెందగా మరో 15 మందికి తీవ్ర గాయాలయ్యాయి. బుధవారం నబరంగ్‌పూర్ జిల్లా రాయిఘర్ నుంచి ఒడి10ఎక్స్ 4057 నెంబర్ గల ఎస్‌పీటీ ట్రావెల్స్ ప్రయివేట్ బస్సు జయపూర్ వైపు వెళ్తుండగా తారాగాం వద్ద జాతీయ రహదారిపై టైర్ పేలడంతో బోల్తా పడింది. ఈ ఘటనలో డాబుగాంకు చెందిన గోవింద త్రిపాఠి (40) బస్సులోనే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పపడాహండి, నబరంగ్‌పూర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. తీవ్ర గాయాలపాలైన 15 మందిని నబరంగ్‌పూర్ జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. ప్రమాద సమయంలో బస్సులో 40 మంది ప్రయాణికులు ఉన్నట్లు ప్రత్యక్ష సాక్షులు పేర్కొన్నారు. క్షతగాత్రులను నబరంగ్‌పూర్ మాజీ ఎమ్మెల్యే సదాశివ ప్రధాని, జెడ్పీ సభ్యుడు అరుణ్ మిశ్రా, ప్రమోద్ రథ్‌లు పరామర్శించారు. అగ్నిమాపక బృందాలు రోడ్డును క్రమబద్ధీకరించి వాహనాల రాకపోకలు పునరుద్ధరించారు.

కారు బీభత్సం





భువనేశ్వర్‌లోని కిట్ కూడలి ప్రాంతంలో బుధవారం ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. స్కోడా కారు వరుసగా రెండు ఆటోల మీదుగా దూసుకుపోయి మరో బైక్‌ని ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో ఐదుగురికి తీవ్ర గాయాలు కాగా, వాహనాలు నుజ్జునుజ్జయ్యాయి.

– భువనేశ్వర్

క్లుప్తంగా

రోడ్డు రోలర్ కాల్చివేత



దుండగులు కాల్చివేసిన రోలర్

మల్కన్‌గిరి : కోరుకొండ సమితి పోట్రేల్ కూడలి సమీపంలో తెంతులిగూడ రహదారి పనుల కోసం వినియోగిస్తున్న రోడ్డు రోలర్‌ను మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కాల్చివేశారు. ఈ మేరకు బీఎస్‌ఎస్ సంస్థ ప్రతినిధులు బుధవారం కోరుకొండ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన ఐఐసీ హిమాంశు శేఖర్ బారిక్ త్వరలోనే నిందితులను పట్టుకుంటామని చెప్పారు.

పెనుగాలుల బీభత్సం



రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టును తొలగిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

జయపురం: జయపురం సబ్‌డివిజన్ బొయిపరిగుడ సమితిలో మంగళవారం రాత్రి పెనుగాలులు బీభత్సం సృష్టించాయి. పలుచోట్ల భారీ వృక్షాలు రోడ్లపై నేలకూలాయి. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. రాత్రి 9.30 గంటల సమయంలో వీచిన గాలులకు బొయిపరిగుడ సమితి దసమంతపూర్ పంచాయతీ పకులపొడ రహదారిలో పెద్ద చెట్టు రోడ్డుకు అడ్డంగా కూలిపోయింది. బొయిపరిగుడ అగ్నిమాపకసిబ్బంది చేరుకొని చెట్టును తొలగించారు.

కవి రమాకాంత రథోకు ఘన నివాళి



రమాకాంత రథో చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

జయపురం: పద్మభూషణ కవి రమాకాంత రథో సంస్మరణ సభను జయపురం విక్రమ విశ్వవిద్యాలయంలో బుధవారం నిర్వహించారు. విశ్వ విద్యాలయ ఒడియా విభాగం వారు నిర్వహించిన కార్యక్రమంలో రమాకాంత రథో చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా విశ్వ విద్యాలయ ఒడియా విభాగ అధిపతి అరుణ కుమార్ రాజు మాట్లాడుతూ.. రమాకాంత రథ్ మరణం ఒడిశా సాహిత్య రంగానికి తీర్చలేని లోటని అన్నారు. ఒడియా సాహిత్యానికి, సాహిత్య ప్రగతికి అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధ్యాపకులు సంజయ కుమార్ సాహు, వాణీశ్రీ రాయ్ పాల్గొన్నారు.


వరుస దొంగతనాలు



మెడికల్ కాలనీలో నిలిపి ఉన్న బైక్‌లు

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలో రోజు రోజుకీ బైక్ దొంగతనాలు ఎక్కువ అవుతున్నాయి. ఒక్క రోజులో మూడు చొట్ల దొంగతనానికి ప్రయత్నించి విఫలం చెందారు. మంగళవారం రాత్రి మల్కన్‌గిరి మెడికల్ కాలనీలో దొంగలు గేట్ తాళం పగలుగొట్టి లోపలికి ప్రవేశించారు. అక్కడ ఓ ఉపాధ్యాయుడు అద్దెకు ఉంటున్నారు. ఆయన బైక్‌తోపాటు మారో బైక్‌ను దొగలించాలని తాళాలు విరగొట్టే ప్రయత్నం చేశారు. బైక్‌కు సెన్సార్ లాక్ ఉండటంతో దొంగలించలేక పార్ట్‌లు తీసుకెళ్లారు. 3 గంటల సమయంలో ఓ మొబైల్ షాప్ వద్ద ఉన్న బైక్‌లను దొంగలించారు. ఘటనపై ఈ రోజు బుధవారం మల్కన్‌గిరి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాధు చేశారు. ఐఐసీ రీగాన్‌కీండో కేసు నమోద్ చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నైపుణ్యాలను అలవరుచుకోవాలి



స్వాధా ఫౌండేషన్ ట్రస్టీ రవినారాయన్ శ్రీనివాసన్‌ను సన్మానిస్తున్న డా.అనితా పాత్ర్

పర్లాకిమిడి: సాంకేతిక విద్య, ఎంబీఏ విద్యార్థులు చదువు పూర్తయ్యాక స్కిల్ డెవలప్‌మెంట్‌ను అలవరుచుకోవాలని, కానీ అందుకు భిన్నంగా చాలామంది విద్యార్థులు వార్షిక ప్యాకేజీ చాలదంటూ పలు కంపెనీల చుట్టూ తిరిగే సంస్కృతి ఇటీవల ఎక్కువైందని ఈర్టీస్ అడ్వయిజరీ ప్రైవేటు కంపెనీ ఆర్థిక సలహాదారు రవి సుబ్రహ్మణ్యం అన్నారు. ఆర్.సీతాపురం సెంచూరియన్ వర్సిటీ క్యాంపస్‌లో బుధవారం స్టూడెంట్స్, మేనేజ్‌మెంట్ ఈవెంట్ 'మంజర్ 2.ఓ' కార్యక్రమం ముగింపు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్రి, ఎంబీఏ, బీటెక్ విద్యార్థుల సందేహాలను కోల్‌కొత్తా, ఐఐఎం పూర్వపు విద్యార్థి రవి సుబ్రహ్మణ్యం నివృత్తి చేశారు. కార్యక్రమంలో స్వాధా ఫౌండేషన్ ట్రస్టీ మోహన్ కుమార్ రామ్మూర్తి, రాం నారాయణ్ శ్రీనివాసన్, సెంచూరియన్ వర్సిటీ రిజిస్ట్రార్ అనితా పాత్ర, మేనేజ్‌మెంట్ డీన్ ప్రజ్ఞాపాణి తదితరులు పాల్గొన్నారు.

మహిళల భద్రతపై కాంగ్రెస్ గర్జన

- సభా కార్యకలాపాలకు అంతరాయం
- సాయంత్రం 4 గంటల వరకు వాయిదా

భువనేశ్వర్:

రాష్ట్రంలో క్షీణించిన శాంతిభద్రతల పట్ల బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వాన్ని కాంగ్రెస్ నిలదీస్తోంది. ప్రధానంగా మహిళలు, మైనరు బాలికల పట్ల పెచ్చుమీరుతున్న అత్యాచారాలు, నేరాలపై విరుచుకుపడుతోంది. దీంతో బడ్జెట్ సమావేశాల కార్యకలాపాలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. బుధవారం కూడా ఇదే పరిస్థితి కొనసాగింది. కాంగ్రెసు సభ్యుల చర్య పట్ల అధికార భారతీయ జనతా పార్టీ సభ్యులు విచారం వ్యక్తం చేశారు. వరుసగా 2 సార్లు వాయిదా సభలో బడ్జెట్ సమావేశాల ఆరంభం నుంచే గందరగోళం నెలకొంది. ప్రశ్నోత్తరాల సమయం ప్రారంభం నుంచే సభలో కాంగ్రెసు సభ్యులు రభసకు దిగారు. మహిళల భద్రతపై ముఖ్యమంత్రి ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. మహిళలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సభ మధ్యలోకి వచ్చి గందరగోళం సృష్టించారు. దీంతో స్పీకర్ సభను మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేసినట్లు తొలుత ప్రకటించారు. ఆ తర్వాత కూడ సభలో పరిస్థితి కుదుటపడలేదు. సభా కార్యకలాపాలు ముందుకు సాగించడం సాధ్యం కాకపోవడంతో సాయంత్రం 4 గంటలకు వాయిదా వేశారు.



శాసన సభలో బడ్జెటు సమావేశాలు

వాయిదా ప్రతిపాదనపై చర్చ కావాలి: కాంగ్రెస్

రాష్ట్రంలో మహిళా వర్గానికి భద్రత లేకుండా పోయిందని, చివరికి పాఠశాలల్లో బాలికలకు రక్షణ కొరవడినా ప్రభుత్వం చోద్యం చూస్తోందని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సభలో నిలదీశారు. ఈ పరిస్థితుల దృష్ట్యా ముఖ్యమంత్రి సభలో వివరణ ప్రవేశ పెట్టి సభా కమిటి ఏర్పాటు చేయాలని వాయిదా తీర్మానం ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదన పట్ల స్పీకరు అంగీకరించకపోవడంతో ఆగ్రహించిన కాంగ్రెసు సభ్యులు స్పీకరు పోడియం వద్దకు వెళ్లి నిరసన వ్యక్తం చేశారు.

కాంగ్రెస్‌ది స్వార్థపూరిత చర్య: బీజేపీ



ఇరాశిష్ ఆచార్య, బీజేపీ ఎమ్మెల్యే

రాష్ట్రంలో మహిళల భద్రత అంశం చాటున స్వార్థ ప్రయోజనాల కోసం ఉద్దేశపూర్వకంగా సభా కార్యక్రమాలకు నిత్యం అంతరాయం కలిగిస్తోందనిబీజేపీ ఎమ్మెల్యే ఇరాశిష్ ఆచార్య ఆరోపించారు. ఈ అంశంపై సభలో చర్చకు ప్రతిపాదించిన వాయిదా తీర్మానంపై చర్చ జరిగిందని రాష్ట్ర న్యాయ శాఖ మంత్రి సభలో బదులిచ్చారు.



డాక్టర్ ప్రసన్న కుమార్ ఆచార్య, బీజేడీ

విచారకరం: డాక్టర్ ప్రసన్న కుమార్ ఆచార్య, బీజేడీ

రాష్ట్రంలో అమాయక మైనరు బాలికలు గర్భం దాల్చడం అత్యంత విచారకరమని, ప్రధాన విపక్షం బిజూ జనతా దళ్ సభ్యుడు డాక్టర్ ప్రసన్న కుమార్ ఆచార్య అన్నారు. మహిళల పట్ల అఘాయిత్యాలు, హత్యలు వంటి సంఘటనలు నిత్య కృత్యాలుగా పరిణమించాయని ఆవేదన వ్యక్తం చేశారు.

బాలికపై బాలుర లైంగికదాడి

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా ఉమ్మర్‌కోట్ పట్టణంలో బాలిక(11)పై ఇద్దరు బాలురు లైంగిక దాడికి పాల్పడిన ఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. రెండు రోజుల ముందు బాలికకు పరిచయం ఉన్న 15 ఏళ్ల వయసు గల ఇద్దరు బాలురు బాధితురాలి ఇంటికి వచ్చారు. ఇంట్లో ఎవరూ లేరని తెలుసుకొని బాలికను బలవంతంగా పక్కనే ఉన్న పొలాల్లోకి లాక్కెళ్లారు. బాలికతో మద్యం తాగించి అపస్మారక స్థితికి చేరాక లైంగిక దాడికి పాల్పడి పరారయ్యారు. అనంతరం బాధితురాలు ఇంటికి వెళ్లి చెప్పడంతో పోలీసులు ఆస్పత్రికి తరలించారు. నిందితులను అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. విషయం తెలిసిన వెంటనే రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు భక్త చరణ్ దాస్ నబరంగ్‌పూర్ జిల్లా కాంగ్రెస్ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. మాజీ రాష్ట్ర పీసీసీ ఉపాధ్యక్షుడు మున్నా త్రిపాఠి, ఏఐసీసీ సభ్యురాలు మనీషా త్రిపాఠిలు ఉమ్మర్‌కోట్ చేరుకున్నారు. బాధిత బాలిక కుటుంబాన్ని పరామర్శించారు. ఉమ్మర్‌కోట్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.



ఉమ్మర్‌కోట్ పోలీసులను కలిసి వస్తున్న కాంగ్రెస్ నాయకులు

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

- మరొకరికి గాయాలు

రాయగడ: నీలావడి అగ్నిగంగమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు బైక్‌పై వెళ్లిన ఒక వ్యక్తి మృతి చెందగా మరొకరు తీవ్రగాయాలకు గురయ్యారు. ఈ ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి జిల్లాలోని సనొ చాందిలి గ్రామానికి చెందిన బి ప్రసన్న (43)గా గుర్తించారు. గాయాలపాలైన వ్యక్తి అదే గ్రామానికి చెందిన బి.ప్రసాద్‌గా సమాచారం. మంగళవారం రాత్రి అమ్మవారిని దర్శించుకునేందుకు సనొ చాందిలి గ్రామానికి చెందిన ఆరుగురు వ్యక్తులు మూడు బైకులపై నీలావడికి బయలు దేరారు. నీలావడికి సమీపంలోని ఉతకపాడు వద్ద నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి వద్ద ముందుగా రెండు బైకులు వెళ్లిపోగా వారి వెనుకే వెళుతున్న ప్రసాద్, ప్రసన్నల బైకు అదుపు తప్పి బ్రిడ్జి కింద పడిపోయింది. వెనుక వస్తున్న ప్రసాద్, ప్రసన్నలు ఇంకా రాలేదని అనుమానించిన తోటి స్నేహితులు తిరిగి వెనుకకువచ్చి చూడగా బ్రిడ్జి కింద పడి ఉన్న ఇద్దరిని చూసి వెంటనే ఆంబులెన్స్‌కు సమాచారం అందించారు. అయితే సంఘటనా స్థలం వద్దే ప్రసన్న ప్రాణాలు కోల్పొగా తీవ్ర గాయాలకు గురైన ప్రసాద్‌ను అంబులెన్స్‌లో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం విశాఖపట్నం రిఫర్ చేశారు. మంగళవారం రాత్రి సుమారు 12 గంటల సమయంలో చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని సందర్శించారు. ప్రసన్న మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.



ప్రమాద దృశ్యం

ధాన్యం కొనుగోలు చేయాలి



కలెక్టరేట్‌కు వచ్చిన పెద్దకొత్తూరు పంచాయతీ రైతులు

పర్లాకిమిడి: జిల్లాలో గుసాని సమితి పరిధి పెద్ద కొత్తూరు పంచాయతీలో ఖరీఫ్‌లో పండించిన సుమారు 3,840 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేయకుండా ఉండిపోయాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో అన్నదాతలు బుధవారం కలెక్టరేట్‌కు వచ్చి అధికారులను కలిశారు. ధాన్యాన్ని కొనుగోలు చేసి న్యాయం చేయాలని ఏడీఎం రాజేంద్రమింజ్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ధాన్యం కొనుగోళ్లు చేయనందుకు మండీ, రెవెన్యూ కార్యాలయానికి పెద్దకోత్తూరుగ్రామ పంచాయతీ వాసులు ఇటీవల తాళాలు వేశారు. ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లకు టార్గెట్ లేదని సొసైటీ అధికారులు అంటున్నారని పెద్దకొత్తూరు రైతులు పద్మ జగన్నాథరావు అంటున్నారు. గుసాని రైతులకు తోలుత నుంచి మండీ అధికారులు ధాన్యం కోనుగోళ్లలో చిన్నచూపు చూస్తున్నారని, ఇప్పటికైనా మిగులు ధాన్యాన్ని కొనుగోలు చేయాలని.. లేకపోతే కోర్టుకు వెళతామని రైతు చెల్లి సోమేశ్వర్‌రావు తెలిపారు.

ముగిసిన శ్రామిక్ కాంగ్రెస్ నిరసన



నిరసన శిబిరంలో ప్రధాన కార్యదర్శి రమేష్ చంద్ర సాహు

భువనేశ్వర్: తూర్పుకోస్తా రైల్వేశ్రామిక్ కాంగ్రెస్ చేపట్టిన నిరసన కార్యక్రమం ముగిసింది. భారతీయ రైల్వే కార్మిక జాతీయ సమాఖ్య(ఎన్ఎఫ్ఐఆర్) పిలుపుమేరకు దేశవ్యాప్తంగా నిర్వహించిన నిరసన కార్యక్రమంలో భాగంగా ఖుర్దారోడ్ మండల సమన్వయకర్త సునీల్ కుమార్ భంజ్ ఆధ్వర్యంలో మండల రైల్వే అధికారి డీఆర్ఎం కార్యాలయం ఎదుట శిబిరం ఏర్పాటు చేసి ప్రతిరోజూ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శాంతియుతంగా నిరసన కొనసాగించిన సంగతి తెలిసిందే. పాత ఫించను వ్యవస్థ పునరుద్ధరణ డిమాండుతో రైల్వే కార్మికుల వివిధ ప్రాథమిక హక్కులపై దేశ వ్యాప్తంగా భారతీయ రైల్వేలోని అన్ని జోన్లు, మండలాల్లో నిర్వహించిన ఆందోళన బుధవారంతో ముగిసింది. ముగింపు సభలో తూర్పు కోస్తా రైల్వే శ్రామిక్ కాంగ్రెసు ప్రధాన కార్యదర్శి రమేష్ చంద్ర సాహు పాల్గొని కార్యకర్తలనుద్దేశించి ప్రసంగించారు. లోకో పైలట్లు, రైలు మేనేజర్లు (గార్డులు) వెతలు, వాణిజ్య విభాగం అధికారుల అహంకారం, ఆపరేటింగ్, సిగ్నల్, ఇంజినీరింగ్ విభాగాల్లో సిబ్బంది అణచివేతను తప్పుపట్టారు. అనంతరం సునీల్ కుమార్ భంజ్ ఆధ్వర్యంలో కార్యకర్తల ప్రతినిధి బృందం ఖుర్దారోడ్ మండల రైల్వే అధికారి హెచ్.ఎస్.బాజ్వాకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నిరంజన్ మిశ్రా, మీడియా ఇన్‌చార్జి లక్ష్మీధర మహంతి తదితరులు పాల్గొన్నారు.

ఉత్కళ దివాస్ ప్రాముఖ్యతను తెలియజేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ బిజయ కుమార్ దాస్

పర్లాకిమిడి: ఏప్రిల్ 1 ఉత్కళ దివాస్, 26న పర్లాకిమిడి మహారాజా కృష్ణచంద్ర గజపతి జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బిజయ కుమార్ దాస్ అన్నారు. కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో బుధవారం సాయంత్రం జిల్లాలోని వివిధ శాఖల అధికారులు, పాఠశాలల హెచ్ఎంలు, ఉత్కళ సమాజ్, తదతర సంస్థల ప్రతినిధులతో ముందస్తు సమావేశాన్ని ఏర్పాటుచేశారు. ఈ సమావేశానికి సబ్ కలెక్టర్ అనుప్ పండా, సి.డి.ఎం.ఓ డాక్టర్ మహమ్మద్ ముబారక్ అలీ, సమగ్ర గిరిజినాభివృద్ధి శాఖ అధికారి అంశుమాన్ మహాపాత్రో, జిల్లా సాంస్కృతిక అధికారి అర్చనా మంగరాజ్, డీఈఓ డాక్టర్ మయాధర్ సాహు, డి.పి.ఆర్.ఓ ప్రదీప్ కుమార్, ఇతర శిక్షా అనుష్టాన్, సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. ఏప్రిల్ 26న మహారాజా కృష్ణచంద్ర గజపతి శ్మశాన వాటిక వద్ద పుష్పాంజలి, వివిధ కూడళ్లల్లో ఆయన విగ్రహాలకు నివాళులర్పించాలన్నారు. విద్యార్థులకు ఉత్కళ దివాస్ సందర్భంగా వక్తృత్వ, డ్రాయింగ్ పోటీలు నిర్వహించాలన్నారు. టౌనుహాల్‌లో ఒడిశా వంటకాల పోటీలు నిర్వహించాలని పలువురు కోరారు.

2.61 క్వింటాళ్ల గంజాయి స్వాధీనం

రాయగడ: జిల్లాలోని మునిగుడ పోలీసులు మంగళవారం రాత్రి భారీ ఎత్తున గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మునిగుడ పోలీస్ స్టేషన్ పరిధిలోని బాలకుబుజు గ్రామం సమీపంలోని ప్రయాణికుల విశ్రాంతి గృహం వద్ద బస్తాలు పడి ఉండటం గమనించిన పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు వాటిని పరిశీలించి ఆశ్చర్యపోయారు. అందులో 2.61 క్వింటాళ్ల గంజాయి బయట పడింది. ఐఐసీ సొదామిని బెహర తెలియజేసిన వివరాల ప్రకారం.. గంజాయి అక్రమ రవాణా జరుగుతుందన్న సమాచారం మేరకు పోలీస్ పెట్రోలింగ్ ముమ్మరం చేశామన్నారు. ఈ క్రమంలో బాలకుబుజు గ్రామ సమీపంలో బస్తాలు ఉండటం గమనించిన పోలీస్ సిబ్బంది ఈమేరకు తనిఖీలు నిర్వహించి గంజాయిని గుర్తించారని చెప్పారు. అయితే గంజాయి అక్రమ రవాణా చేసే వ్యక్తులు మాత్రం పట్టుబడలేదన్నారు. కేసు నమెదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



రాయగడ: స్వాధీనం చేసుకున్న గంజాయితో ఉన్న బస్తాలు

ద్విచక్ర వాహనంపై..

ద్విచక్ర వాహనంపై గంజాయిని అక్రమంగా తరలిస్తున్న ఒక వ్యక్తిని రాయగడ జిల్లా పద్మపూర్ పోలీసులు పట్టుకున్నారు. అతని నుంచి 28.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పద్మపూర్ ఐఐసీ ధరణీధర్ ప్రధాన్ తెలియజేసిన వివరాల ప్రకారం.. జిల్లా ఎస్పీ స్వాతి ఎస్ కుమార్ ఆదేశాల మేరకు గంజాయిపై ఉక్కుపాదం మోపుతున్న తరుణంలో పద్మపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శారదాపూర్-పద్మపూర్ కూడలిలో వాహన తనిఖీలను మంగళవారం నాడు నిర్వహిస్తున్న సమయంలో ఓ వ్యక్తి బైకుపై బస్తాను తీసుకొని రావడాన్ని గుర్తించారు. అనుమానంతో వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా బస్తాలో గంజాయి పట్టుబడింది. నిందితుడు గజపతి జిల్లా ఆర్ ఉదయగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని అంగురు గ్రామానికి చెందిన దేవాశీష్ మండలిగా గుర్తించారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ. 2.80 లక్షలు ఉంటుందని అంచనా వేశారు.



గంజాయిని రవాణా చేస్తూ పట్టుబడిన నిందితుడుతో పోలీసులు



పర్లాకిమిడి: పట్టుబడిన బస్తాల్లో గంజాయి ప్యాకెట్లు

344 కిలోల గంజాయి పట్టివేత

పర్లాకిమిడి: గజపతి జిల్లా రాయగడ రోడ్డు వద్ద బుధవారం అబ్కారీ శాఖ పెట్రోలింగ్ చేస్తుండగా ఒక బజాజ్ ఆటోలో ఎనిమిది బస్తాల గంజాయి పట్టుబడింది. గజపతి ఎక్సైజ్ సూపరింటెండెంట్ ప్రదీప్ కుమార్ సాహు వెల్లడించిన వివరాల ప్రకారం.. రాయగడ రోడ్డు చెక్‌పోస్టు వద్ద తమ సిబ్బంది తనిఖీలు చేపట్టగా ఓ ఆటోలు కొన్ని బస్తాలు ఉండటాన్ని గమనించారు. దీంతో అనుమానంతో వాటిని పరిశీలించగా.. ఎనిమిది బస్తాల్లో గంజాయి ప్యాకెట్లు ఉన్నట్లు గుర్తించారన్నారు. వాటిని తూకం వేయగా 344 కిలోలు ఉన్నట్టు తేలిందన్నారు. దీని విలువ మార్కెట్‌లో రూ.35 లక్షలు ఉంటుందన్నారు. పట్టుబడిన ఆటో డ్రైవర్ మోహనా బ్లాక్ బోడసింధిబా గ్రామానికి చెందిన కమల్ లోచన్ మఝిగా గుర్తించి అరెస్టు చేసి కోర్టుకు తరలించామన్నారు. దాడుల్లో అబ్కారీ శాఖ మొబైల్ యూనిట్ ఎస్సై దుర్యోధన దిగాల్ ఉన్నారు.



పర్లాకిమిడి: పట్టుబడిన ఆటో డ్రైవర్, గంజాయి బస్తాలు

ఉత్సాహం ఉత్సవమై..

- ఘనంగా ముగిసిన డెప్పిగూడ అగ్ని గంగమ్మ ఘటోత్సవం
- తరలివచ్చిన భక్తజనం

జయపురం: జయపురం డెప్పిగూడ అగ్ని గంగమ్మ తల్లి ఘటోత్సవాలు బుధవారంతో ఘనంగా ముగిశాయి. చివరి రోజున అమ్మవారి దర్శనానికి భక్తులు ఉత్సాహంగా తరలివచ్చారు. ఈ నెల 12వ తేదీన ప్రారంభమైన ఘటోత్సవాలు మున్నెన్నడూ లేనంత ఆడంబరంగా.. అంగరంగ వైభవంగా జరిగాయి. ఐదు దశాబ్దాల కిందట గులాబ్ అనే భక్తుడు డెప్పిగూడ పైగల చిన్న కొండపై పూరిపాకలో అమ్మవారిని ప్రతిష్ఠించాడు. ఆ నాటి నుంచి క్రమం తప్పకుండా అతడి సంతతి వారు స్థానికుల సహకారంతో ఏటా అగ్ని గంగమ్మ తల్లి ఘటోత్సవాలు జరుపుతున్నారు. ఈ ఏడాది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పశ్చిమ గోదావరి జిల్లా మార్టేరు గ్రామం నాగేంద్ర ఈవెంట్స్ వారి ప్రత్యేక పౌరాణిక వేషాల ప్రదర్శనలు ప్రజలను అలరించాయి. చివరి రోజైన బుధవారం మధ్యాహ్నం 11 గంటల సమయంలో వందలాదిమంది మహిళలు, పురుషులు, బాలబాలికలు ఘటాలతో డెప్పిగూడ ప్రధాన పూజా మందిరం నుంచిబయలు దేరి 26వ జాతీయ రహదారి శ్మశాన రోడ్డు కూడలి వద్ద గల అగ్ని గంగమ్మ తల్లి గుడికి చేరుకున్నారు. అక్కడ అమ్మవారికి భక్తులు గొర్రెలు, మేకలు, కోళ్ల బలి ఇచ్చి రక్త తర్పణం చేసి మొక్కులు తీర్చుకున్నారు. కొబ్బరికాయలు కొట్టి ఫలపుష్పాలతో పూజలు చేశారు. అగ్ని గంగమ్మ తల్లిని పూజించి ఏమి కోరుకుంటే అది నేరవేర్చుతుందన్న ప్రగాఢ నమ్మకం ప్రజలలో ఉండడంతో అధికసంఖ్యలో భక్తులు అమ్మవారిని పూజించేందుకు తరలివచ్చారు. డెప్పిగూడ అగ్ని గంగమ్మ పూజాకమిటీ పర్యవేక్షణలో ఉత్సవం వైభవంగా ముగిసింది.



పూజలందుకున్న అగ్ని గంగమ్మ తల్లి



అగ్ని గంగమ్మ ఘటజాతరలో మహిళా భక్తులు



అగ్ని గంగమ్మ ఘటజాతర కమిటీ సభ్యులు

ముగ్గురు అరెస్టు

జయపురం: పట్టణంలో వరుసగా ఏసీ కాపర్‌పైపు ముక్కల దొంగతనాల కేసులలో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు పట్టణ పోలీసు అధికారి ఈశ్వర తండి బుధవారం తెలిపారు. ఈ నెల 16వ తేదీ ఉదయం 3 నుంచి 4 గంటల మధ్య కొంత మంది దుండగులు జయపురం మెయిన్ రోడ్డు, ప్రభుత్వ ఎ.ఎన్.ఎం కేంద్రంలోని ఏసీ కాపర్ పైపులు, వైర్లు దొంగతనానికి గురయ్యాయని డాక్టర్ దుర్గా ప్రసాద్ పాత్రో ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ ఎ.ఎన్.ఎం కేంద్రంలో ఏసీ కాపర్ వైర్లు, ఎ.ఎన్.ఎం ప్రిన్సిపాల్ సరస్వతీ బెహర ఇంటిలోనూ దొంగతనం జరిగినట్లు ఫిర్యాదు చేశారు. డాక్టర్‌దుర్గా ప్రసాద్ పాత్రో ఉంటున్న క్వార్టర్‌లో ఏసీ కాపర్ వైర్లను, కొత్త షాపింగ్ మాల్, రెలయన్స్ ట్రెండ్‌ల లోనూ వైర్లు దొంగిలించనట్లు ఫిర్యాదులు రాగా కేసులు నమోదు చేశామన్నారు.దర్యాప్తు చేయాలని పోలీసు ఎస్ఐ, ఆర్.సి.హెచ్ మహాపాత్రోను ఆదేశించామని వెల్లడించారు. మహాపాత్రో కేసులను దర్యాప్తు చేపట్టి నిందితులను గుర్తించారని వెల్లడించారు. నిందితుడు సచిన్ కుమార్ నాయక్ తన నలుగురు అనుచరులతో 16వ తేదీ తెల్లవారుజామున పట్టణంలోని వివిధ చోట్ల ఏసీ కాపర్ వైర్లను దొంగిలించినట్లు వెల్లడించారు. దొంగిలించిన కాపర్ వైర్‌ను ముక్కలుగా చేసి పాత తహసీల్దార్ కార్యాలయంలో దాచి పెట్టారన్నారు. వీటిని ప్రసాదరావుపేటలో ఎ.వెంకటరావు కుమారుడు ఎ.రవికి విక్రయించారని వెల్లడించారు. పట్టుబడిన నిందితుల నుంచి 15 కేజీల ఏసీ కాపర్ పైపు ముక్కలను స్వాధీన పరుచుకున్నట్లు వెల్లడించారు. కేజీ రూ.500 చొప్పున విక్రయించారన్నారు. ఈ కేసులో జయపురంలోని కొత్తవీధికి చెందిన బాదల్ స్వైన్(18), జాంబడ వీధికి చెందిన సచిన్ కుమార్ నాయక్(27)తోపాటు వాటిని కొన్న రవిని అరెస్టు చేశామన్నారు. మిగిలినవారు పరారీలో ఉన్నట్లు వెల్లడించారు.



కాపర్ వైర్ల దొంగతనం కేసులో పట్టుబడిన నిందితులు

క్లుప్తంగా

విద్యుత్ బిల్లుల కాల్చివేత

• ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలంటూ సీపీఎం నిరసన


విద్యుత్ బిల్లులు దహనం చేసిన సీపీఎం సభ్యులు

విజయనగరం గంటస్తంభం: విద్యుత్ బిల్లులు తగ్గించి ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో పూల్‌భాగ్ కాలనీ 4వ వార్డులో విద్యుత్ బిల్లులు కాల్చివేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రెడ్డి శంకర్రావు మాట్లాడుతూ..కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచే ప్రసక్తి లేదని చెప్పిన చంద్రబాబు నేడు విద్యుత్ చార్జీలు పెంచి ట్రూ అప్ చార్జీల భారం వేయడం అన్యాయమన్నారు. ట్రూ అప్ చార్జీలను రద్దు చేసి విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ట్రూ అప్, సర్దుబాటు చార్జీల పేరిట రూ.15 వేల కోట్ల విద్యుత్తు భారం మోపిందన్నారు. అవినీతితో కూడిన సెకీ ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శాఖ కార్యదర్శి రామాలక్ష్మి, సభ్యులు విజయ, గురయ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన మంత్రి యోగా అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురంటౌన్: ప్రధానమంత్రి యోగా అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సెట్విజ్ సీఈఓ ఎ.సోమేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జూన్ 21 అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వ్యక్తులు, సంస్థలు సమాజంలో యోగాను అంకిత భావంతో ప్రజల్లోకి తీసుకు వెళ్లినవారు ఈ అవార్డులకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అవార్డులకు ఎంపికైన వారికి రూ. 25 లక్షల నగదు బహుమానం ఉంటుందన్నారు. అర్హత కలిగిన వారు దరఖాస్తులను నిర్ణీత ప్రొఫార్మాలో నేరుగా డబ్ల్యూ.డబ్ల్యూ.డబ్ల్యూ.మైజీఓవీ.ఐఎన్ వెబ్‌సైట్‌లో హెచ్‌టీటీపీఎస్://ఇన్నొవేషన్ఇండియా.మైజీఓవీ.ఐన్/పీఎం-యోగా-అవార్డులు-2025 లింక్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ నెల 31లోగా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

10 లీటర్ల సారా స్వాధీనం

• ద్విచక్రవాహనం సీజ్

గుమ్మలక్ష్మీపురం (కురుపాం): కురుపాం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం జియ్యమ్మవలస మండలం దత్తివలస గ్రామంలో 10 లీటర్ల సారాను ద్విచక్రవాహనంపై తరలిస్తూ చినమేరంగి గ్రామానికి చెందిన వెలగాడ బాలకృష్ణ పట్టుబడ్డట్లు సీఐ పి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ మేరకు స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనం, సారాను కురుపాం ఎక్సైజ్ స్టేషన్ వద్ద చూపించారు. బాలకృష్ణతో పాటు సారా సరఫరా చేసిన సిరిపురం సుధాకర్‌పై కూడా కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

టాటా ఏస్ వాహనం బోల్తా

• ఇద్దరికి గాయాలు

గంట్యాడ: మండలంలోని లక్కిడాం నుంచి బొండపల్లి మండలంలోని రయింద్రం గ్రామానికి వాటర్ బస్తాలు తీసుకుని వెళ్తుండగా గంట్యాడ మండలంలోని చినమానాపురం జంక్షన్ వద్ద టైర్ పంక్చర్ కావడంతో 15 అడుగుల గోతిలో టాటా ఏస్ వాహనం బోల్తాపడింది. దీంతో అందులో ఉన్న ఇద్దరు వ్యక్తులకు గాయాల య్యాయి. ప్రైవేట్ వాహనంలో వారిని విజయనగరంలోని ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ సంఘటనపై ఫిర్యాదు రాలేదని గంట్యాడ పోలీసులు తెలిపారు.

శంబర పోలమాంబ అమ్మవారి జాతర ఆదాయం లెక్కింపు

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి ఎనిమిదవ జాతర ఆదాయాన్ని ఈవో వీవీ.సూర్యనారాయణ ఆధ్వర్యంలో బుధవారం లెక్కించారు. శీఘ్రదర్శనం టిక్కెట్ల ద్వారా రూ.69,700, ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా రూ.59,760. కేశఖండన టిక్కెట్ల ద్వారా రూ.2,400, మహాఅన్నదానం విరాళాల ద్వారా రూ.92,011, లడ్డూప్రసాదం ద్వారా రూ.61,950, పులిహోర ప్రసాదం ద్వారా రూ.42,250 ఆదాయం సమకూరినట్లు ఈవో తెలిపారు. మొత్తంగా ఎనిమిదవ జాతరలో రూ.3,28,071 ఆదాయం వచ్చిందని చెప్పారు.

పది హిందీ పరీక్షకు 99.53 శాతం హాజరు

పార్వతీపురంటౌన్: పదవతరగతి హిందీ పరీక్షకు 99.53 శాతం హాజరు నమోదైనట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.తిరుపతి నాయుడు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పార్వతీపురం మన్యం జిల్లా వ్యాప్తంగా 67 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. 10,367 మంది విద్యార్థులకు గాను 10,319 మంది హాజరయ్యారని, 48 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. 31 మంది స్క్వాడ్ సిబ్బంది పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారని తెలిపారు.


తిండి గింజలు లేక ముగ్గు పిండిని తింటున్న ఊర పిచ్చుకలు

పిచ్చుకపై.. బ్రహ్మాస్త్రాలు..!

• కిచకిచల మనుగడకు ముప్పు
• నేడు ప్రపంచ పిచ్చుకల దినోత్సవం



భామిని: ఇంటి చూర్లు, లోగిళ్లలో నివాసంతో ఇంటిల్లిపాదికి పిచ్చుకలు ఆనందం పంచేవి. మనుషుల మధ్య మమేకమై సహజీవనం సాగించేలా మన ముందే ఎగురుతూ అలరించేవి. నేలబావులపైన వాలిన చెట్లుపైన, పొదలు తుప్పలపైన, ఇంటి ముంగిళ్లలో ఊగిసలాడుతూ అందమైన పిచ్చుక గూళ్లు నిర్మించేవి. అపరూపమైన కళానైపుణ్యంతో నిర్మించిన పిచ్చుక గూళ్లు ఆధునిక ప్రపంచంలోనూ గృహనిర్మాణాలకు ఉదాహరణగా మారాయి. పూరింటి చూరుపై కట్టిన గూళ్లపై వాలుతూ ఊగుతూ, వేలాడుతూ కిచకిచ రావాలతో అలరించేవి.

తల్లి ప్రేమకు రుజువు

జంటకట్టిన పిచ్చుకల జత చెట్ల ఆకులనుంచి తెచ్చిన మెత్తని నార పీచుతో అల్లి నిర్మించిన పిచ్చుక గూళ్ల నిర్మాణం, రక్షణ వలగా మారిన గూళ్లలో గుడ్లు పెట్టి, పిల్లలు పుట్టే వరకు పొదగడం, దగ్గరుండి వాటిని సంరక్షించడంలో దిట్టగా కనిపించేవి. ఏరి తెచ్చిన గింజలను పిల్లల నోటికి అందిస్తూ తల్లి ప్రేమకు రుజువుగా నిలిచేవి. పిల్లలు పెరిగి పెద్దవయ్యే వరకు సంరక్షించడం అన్యోన్యమైన జీవన విధానం ప్రతిబింబించేవి.

ఆధునికత రూపంలో..

పర్యావరణ హితులైన పిచ్చుకల జీవనంపై ఆధునికత వేటు వేస్తోంది. విద్యుత్ రూపంలో ఇళ్లలో ఫ్యాన్లు, ఏసీలు గూళ్ల నిర్మాణాలకు అడ్డుకట్ట వేశాయి.సెల్ టవర్ల నుంచి ఉద్భవించే రేడియేషన్ పునరుత్పత్తి లేకుండా చేశాయి. వ్యవసాయ రంగంలో వచ్చిన యాంత్రీకరణతో కళ్లాల్లో తిండి గింజలు కరువై జీవనం కష్టమైంది. వరిచేను కుప్పలు, ధాన్యం రాశులు తగ్గిపోవడం పిచ్చుకల మనుగడకు కష్టంగా మారింది. కాంక్రీట్ భవనాలు పిచ్చుకల వృద్ధిపై ప్రభావం చూపుతున్నాయి. ధాన్యం నిల్వలు లేకుండా పోవడం, పంటచేలపై క్రిమి సంహారక మందులు పిచ్చుకల మనుగడకు కష్టంగా మారుతున్నాయి.

ఒకప్పుడు పంటచేలు, పల్లె ముంగిళ్లు, ధాన్యపు రాశుల్లో కిచకిచమంటూ, గుంపుగా వాలడం ఏదో అలికిడి అవగానే తుర్రుమని ఎగరడం వంటి దృశ్యాలు సందడిగా, చూడముచ్చటగా ఉండేవి. కానీ ప్రస్తుతం ఇంధన కాలుష్యం, పెరుగుతున్న అపార్ట్‌మెంట్ కల్చర్, సాంకేతిక మార్పులతో పాటు సెల్ టవర్ల నిర్మాణం. సాధారణంగా పిచ్చుకపై బ్రహ్మాస్త్రాలుగా మారాయి. మొగుడ్ని కొట్టి మొగసాల కెక్కినట్లు అనే సామెత చందంగా పిచ్చుకలు బతికే పరిస్థితులు లేకుండా చేస్తూ పిచ్చుకల రోజొకటి నిర్వహించడం విచిత్రం.



మానవత్వంతో ఆదరించాలి

పర్యావరణ పరిరక్షకులైన, చిరుప్రాణులైన పిచ్చుకలను మానవత్వంతో ఆదరించాలి. బంగారు పిచ్చుకలను పెంచవలసిన బాధ్యత పెరిగింది.అరు బయట తిండి గింజలు వేయడం, చూరుపై చిన్న చిన్న కప్పులతో నీటిని పెట్టడం, ఇంటి సన్‌స్లేడ్‌లపై ఖాళీలలో పెట్టిన గూళ్లను కాపాడడం వంటి చర్యలు చేపట్టాలి. గ్రామాల్లో సెల్ టవర్స్ ఏర్పాటు లేకుండా రేడియేషన్‌కు దూరం చేయాలి. పిచ్చుకలు తినడంతో తిండి గింజలు నష్టపోతున్నామనే అపోహ విడనాడాలి. పంటపై పడిన కీటకాలు,పురుగులను పిచ్చుకలు తిని రైతుకు మేలు చేస్తాయి.

డాక్టర్ జీఎస్‌నాయుడు, పీహెచ్‌డీ, జువాలజీ, భామిని

పిచ్చుకలు అంతరించి పోకుండా కాపాడాలి



ఒకప్పుడు పల్లెల్లో గుంపులు గుంపులుగా సందడి చేస్తూ కనిపించే పిచ్చుకలు క్రమేపీ అంతరించిపోతున్నాయి.పర్యావరణ సమతౌల్యం కాపాడడంలో పిచ్చుకలు ముఖ్య భూమిక వహిస్తాయి, వాతావరణ కాలుష్యాన్ని తగ్గించాలి. సెల్ టవర్స్ దూరంగా ఉండేలా చూడాలి. మనతో సహజీవనం చేసే పిచ్చుకలను స్నేహితులుగా భావించి రక్షించుకోవాలి.

కేవీ రమణమూర్తి, సీఈఓ, గ్రీన్‌మెర్సీ సంస్థ, శ్రీకాకుళం

మారిక రోడ్డుకు మోక్షం

• గిరిజనుల హర్షం
• కలెక్టర్‌కు ధన్యవాదాలు తెలిపిన గ్రామస్తులు


మారిక గ్రామసమీపంలో రోడ్డు పనుల వద్ద ఆనందం వ్యక్తం చేస్తున్న గిరిజనులు


మారిక రోడ్డు పనుల్లో మెటల్‌వేసిన దృశ్యం

వేపాడ: గిరిశిఖర మారిక గ్రామ గిరిజనుల దశాబ్దాల పోరాటం సఫలీకృతం కావడంతో మారిక రోడ్డు నిర్మాణం చురుగ్గా సాగుతోందని సీపీఎం జిల్లా నాయకుడు చల్లా జగన్ అన్నారు. ప్రజాచైతన్య యాత్రలో భాగంగా మారిక తండాలో రెండు రోజులు బస చేసిన నాయకులు బుధవారం మారిక సమీపంలో జరుగుతున్న రోడ్డు పనుల వద్దకు చేరుకుని హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ మారిక గిరిజన గ్రామానికి రోడ్డు కావాలని, స్వాతంత్ర్య ఫలాలు గిరిజనులకు అందాలంటూ 2013, 2017, 2021,2025 సంవత్సరాల్లో రోడ్డుకోసం ఎంపీడీఓ కార్యాలయం ముట్టడి, వంటావార్పు, కార్యాలయ నిర్బంధం లాంటి పోరాటాల్లో యువత, మహిళలు, పెద్దలు పోరాడినందున ఆ ఫలితంగా నేడు రోడ్డు నిర్మాణానికి మార్గం సుగమమైందన్నారు. ఈ రోడ్డు నిర్మాణానికి కలెక్టర్ జాతీయ ఉపాధిహామీ పథకం నిధులు రూ.7కోట్లు కేటాయించటమే కాకుండా రోడ్డు నిర్మాణంపై చొరవ చూపించారంటూ కలెక్టర్‌కు ధన్యవాదాలు తెలిపారు. అలాగే తమ సమస్య పరిష్కారంలో స్థానిక ప్రజాప్రతినిధులు కృషిచేయడంతో పాటు గతంలో అసంపూర్తిగా నిలిచిన రోడ్డుపనులు, కొత్తగా మంజూరైన రోడ్డు పనులు ఒకేసారి చేపట్టడంతో గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు పాలకులు మరింత చొరవ చూపి వర్షాకాలంనాటికి రోడ్డునిర్మాణం పూర్తయ్యేలా చూడాలని కోరుతున్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుడు చలుమూరి శ్యామ్ మారిక పెద్దలు కిలోఆనంద్, గమ్మెల రామకృష్ణ, బాబారావు, అప్పలనాయుడు, అను, అర్జున్, వెంకటరావు,లింగరాజు, కృష్ణ, శ్రీను మహిళలు పాల్గొన్నారు.

బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలు


సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు

పార్వతీపురంటౌన్: బీసీ కార్పొరేషన్ ద్వారా అర్హులైన వారికి రుణాలు మంజూరు చేసేందుకు చర్యలు చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ మేరకు బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలకు చెందిన వారు స్వయం ఉపాధికి సచివాలయాల వద్ద, మీసేవా కేంద్రాల వద్ద, నెట్‌సెంటర్ల వద్ద వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. జనరిక్ మెడికల్ స్టోర్ నిర్వహించాలనుకున్న వారు బి-ఫార్మసీ, డి-ఫార్మసీలో ఉత్తీర్ణత సాధించి ఉండాలన్నారు. 21 నుంచి 60ఏళ్ల మధ్య వయస్సు అభ్యర్థి కలిగి ఉండాలన్నారు. ఉచిత టైలరింగ్ శిక్షణకు 21 నుంచి 50ఏళ్ల వయస్సు మధ్య వయస్సు ఉండాలన్నారు. శిక్షణ పూర్తి చేసిన తరువాత కుట్టు మిషన్లు ఉచితంగా అందజేస్తామని తెలిపారు. కుమ్మరి, మేదర కులాలకు చెందిన వారి కులవృత్తి నిర్వహించేందుకు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 22 లోగా తమ వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు.

రసాయన శాస్త్రంలో నైపుణ్యంతో ఉద్యోగావకాశాలు

• గిరిజన యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసన్

విజయనగరం అర్బన్: ఉన్నత విద్యలో రసాయన శాస్త్రంలో నైపుణ్యంతో ఉపాధి, ఉద్యోగావకాశాలు అధికంగా లభిస్తాయని కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ రిజిస్ట్రార్ టి.శ్రీనివాసన్ అన్నారు. ఈ మేరకు స్థానిక గిరిజన యూనివర్సిటీ ప్రాంగణంలో 'మాలిక్యులస్ టు మెటీరియల్స్' అనే అంశంపై బుధవారం నిర్వహించిన ఒక రోజు సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆవిష్కరణ, విద్యానైపుణ్యాన్ని పెంపొందించడంలో యూనివర్సిటీ ఎప్పుడూ ముందంజలో ఉంటుందన్నారు. మెటీరియల్ సైన్స్ పైనే ప్రపంచం ఆధార పడి ఉందని చెప్పారు. రాబోయే రోజుల్లో ఇది ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, నానో టెక్నాలజీలతో కలిసి ప్రపంచాన్ని శాసించే విధంగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సదస్సులో జర్నల్ ఆఫ్ కెమికల్ సైన్సెస్ చీఫ్ ఎడిటర్, బెంగళూరు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్‌కి చెందిన ప్రొఫెసర్ ఎస్.నటరాజన్, ప్రొఫెసర్ బాలాజీ ఆర్ జాగీర్దార్, ప్రొఫెసర్ కేఆర్‌ప్రసాద్ మాట్లాడుతూ అధునాతన పద్ధతులలో తయారు చేసిన వివిధ పదార్థాలపై పరిశోధనాత్మక అంశాలను వివరించారు. కెమిస్ట్రీ విభాగాధిపతి ప్రొఫెసర్ ముక్కామల శరత్‌చంద్రబాబు, కో ఆర్డినేటర్ డాక్టర్ సురేష్‌బాబు, డాక్టర్ పడాల కిషోర్ నిర్వహణలో జరిగిన సదస్సులో యూనివర్సిటీ అధ్యాపకులు, వివిధ కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల పోలీస్ శాఖ అలెర్ట్

• బాధితులు 1930కు ఫిర్యాదు చేయాలి
• నేరాలు ఛేదించేందుకు నైపుణ్యం మెరుగుపర్చుకోవాలి
• జిల్లా పోలీస్ కార్యాలయంలో కానిస్టేబుల్స్‌కు ఒకరోజు శిక్షణ


జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో సైబర్ నేరాల గురించి కానిస్టేబుల్స్‌కు నిర్వహించిన శిక్షణలో దిశానిర్దేశం చేస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: సైబర్ నేరాలను అరికట్టేందుకు, కేసుల దర్యాప్తుకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని, నైపుణ్యాన్ని మెరుగుపర్చుకోవాలని ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశించారు. ఈ మేరకు జిల్లా పోలీస్ కార్యాలయం కాన్ఫరెన్స్ హాలులో వివిధ పోలీస్‌స్టేషన్లలో కంప్యూటర్ ఆపరేటర్లుగా పని చేస్తున్న కానిస్టేబుల్స్‌కు ఒకరోజు శిక్షణ కార్యక్రమం బుధవారం జరిగింది.రాబోయే రోజుల్లో సైబర్ నేరాలు, మోసాలు మరింత పెరిగే అవకాశం ఉందని, ఈ తరహా నేరాలను నియంత్రించేందుకు నమోదైన కేసుల్లో దర్యాప్తు చేపట్టేందుకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రతి సిబ్బంది మెరుగుపర్చుకోవాలని సూచించారు. సైబర్ నేరాలను ఛేదించడంలో సమర్ధవంతంగా ఎవరైతే విధులు నిర్వహిస్తారో వారికి తప్పనిసరిగా శాఖలో ప్రత్యేకమైన గుర్తింపు లభిస్తుందన్నారు.

బాధితులు వెంటనే ఫోన్ చేయాలి

సైబర్ నేరం జరిగిన వెంటనే బాధితులు1930కు ఫిర్యాదు చేసే విధంగా చూడాలని ఫిర్యాదు అంశాలను ముందుగా పరిశీలించి, అది ఏ తరహా నేరమో గుర్తించాలని సిబ్బందికి సూచించారు. నేరం జరిగిన తీరును తెలుసుకుని, బాధితులను విచారణ చేసిన తరువాత, నేరానికి సంబంధించిన ఆధారాలు, డాక్యుమెంట్లు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. బాధితుడి బ్యాంకు స్టేట్‌మెంటును పరిశీలించి, నేరానికి పాల్పడిన మోసగాడి బ్యాంకు అకౌంటుకు నగదు ఏవిధంగా బదిలీ అయ్యింది, అక్కడి నుంచి ఇంకేమైనా అకౌంట్స్‌కు నగదు బదిలీ జరిగిందా? లేదా? అన్న విషయాలను గుర్తించాలని చెప్పారు. ఇలా గుర్తించిన బ్యాంకు లావాదేవీలను ఫ్రీజ్ చేసేందుకు సంబంధిత విభాగాలకు ఎటువంటి ఆలస్యం చేయకుండా ఉత్తర ప్రత్యుత్తరాలు జరపాలని పేర్కొన్నారు. నేరం జరిగిన గోల్డెన్ అవర్స్‌లో ఫిర్యాదు దారు 1930కు రిపోర్టు చేస్తే, సైబర్ మోసగాడి బ్యాంకు లావాదేవీలను నియంత్రించేందుకు ఉత్తర. ప్రత్యుత్తరాలు సకాలంలో జరిపితే కోల్పోయిన నగదును తిరిగి బాధితుడికి ఇప్పించే అవకాశం ఉంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. శిక్షణలో సైబర్ అండ్ సోషల్ మీడియా సెల్ సీఐ బి.శ్రీనివాసరావు, ఎస్పీ సీఐ ఏవీ లీలారావు, కంప్యూటర్ నిపుణులు రామరాజు, కె.ప్రసాద్, జగదీష్ ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బడి బస్సులు ఏర్పాటు చేయాలి


కాంప్లెక్స్ వద్ద నిరసన చేస్తున్న ఎస్ఎఫ్ఐ సభ్యులు

విజయనగరం గంటస్తంభం: జిల్లాలో అవసరం ఉన్న చోట బడిబస్సులు ఏర్పాటు చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మయూరి జంక్షన్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు జి.సూరిబాబు, కె.రాజు మాట్లాడుతూ జిల్లాలో విద్యార్థులు బడి బస్సుల కోసం ఇబ్బంది పడుతున్నారన్నారు. జిల్లా వ్యాప్తంగా బడి బస్సుల సంఖ్య పెంచాలని కోరారు. గతంలో లాగా విజయనగరం నుంచి రణస్థలం వరకు, విజయనగరం నుంచి సతివాడ, విజయనగరం నుంచి కుమిలి వరకు బడి బస్సులు ఏర్పాటు చేయాలని కోరారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 9 నెలలు కావస్తున్నా సమస్య పరిష్కారం కాలేదని, ఇప్పటికైనా బడి బస్సుల సమస్యను పరిష్కరించకపోతే విద్యార్థులతో కలిసి ప్రభుత్వంపై పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా సహ కార్యదర్శులు శిరీష, సోమేష్, పట్టణ కమిటీ సభ్యులు శివ, గుణ, జయ,లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నీలగిరి తోటలు దగ్ధం


మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

వేపాడ: మండలంలోని వీలుపర్తి పంచాయతీ శివారు కొత్తూరు గ్రామం సమీపంలో బుధవారం జరిగిన అగ్ని ప్రమాదంలో నీలగిరి, టేకు తోటలు దగ్ధమయ్యాయి. ఎస్.కోట అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందడంతో ఫైర్‌స్టేషన్ అధికారి ఎస్.కె మదీనా నేతృత్వంలో సిబ్బంది శ్రీనివాసరావు, లక్ష్మణరావు, వెంకటరావులు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. కొత్తూరు గ్రామానికి చెందిన బోజంకి ఎరుకునాయుడు, బోజంకి ఈశ్వర్రావు, జూరెడ్డి దేముడు తదితర 15 మందికి సంబంధించిన నీలగిరి, టేకు చెట్లు సుమారు పది ఎకరాల్లో కాలిపోయినట్లు అగ్నిమాపక సిబ్బంది చెప్పారు. సుమారు రూ.నాలుగు లక్షల ఆస్తి నష్టం ఉంటుందని స్థానికులు అంచనా వేస్తున్నారు.

బాలల సంక్షేమం కోసం కమిటీలు

• జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్


సమావేశంలో మాట్లాడుతున్న జేసీ సేతు మాధవన్

విజయనగరం ఫోర్ట్: మిషన్ వాత్సల్య కార్యక్రమం కింద బాలల సంక్షేమం, పరిరక్షణ కోసం గ్రామస్థాయిలో సర్పంచ్ ఆధ్వర్యంలో కమిటీలను ఏర్పాటు చేసి ప్రతి 15 రోజులకు ఒకసారి సమావేశం నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ సేతుమాధవన్ అన్నారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో బుధవారం జిల్లా స్థాయి బాలల పరిరక్షణ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ గ్రామ స్థాయి కమిటీలో మహిళా పోలీస్ కన్వీనర్‌గా ఉంటారని, పంచాయతీ సభ్యులు, ఉపాధ్యాయులు, ఎన్‌జీఓలు, ఆరోగ్యవర్కర్స్ తదితరులు సభ్యులుగా ఉంటారని తెలిపారు. గ్రామస్థాయి సమావేశాల్లో అనాథ పిల్లల్ని, స్కూల్ డ్రాపౌట్స్‌ను గుర్తించాలని చెప్పారు. బాల్య వివాహాలు, ట్రాఫికింగ్, డ్రగ్స్ దోపిడీ తదితర అంశాలపై చర్చించాలని సూచించారు. బాలల హక్కుల సంరక్షణపై అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. గ్రామ స్థాయి కమిటీలో చర్చించిన అంశాలను జిల్లాస్థాయి కమిటీకి పంపించాలని ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. గ్రామస్థాయిలో టీనేజీ ప్రెగ్నెన్సీ, బాల్య వివాహాలపై చర్చ జరగాలని, బాల్యవివాహాలు చేయాలనే ఆలోచనే తల్లిదండ్రులకు రాకుండా చేయాలన్నారు. బాల్య వివాహ చట్టంపై అవగాహన కల్పించి చట్టంలో ఉన్న శిక్షలపై కూడా తెలిసేలా చూడాలని చెప్పారు. హోటల్స్, కర్మాగారాల్లో పనిచేసే బాలలను గుర్తించాలని కోరారు. సమావేశంలో ఇన్‌చార్జి ఐసీడీఎస్ పీడీ ప్రసన్న, డీఎంహెచ్‌ఓ డాక్టర్ జీవనరాణి, విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ నల్లనయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు దుర్మరణం

• హైవేపై బైక్‌ను ఢీకొట్టిన క్యారియర్ వ్యాన్


లక్షణరావు(ఫైల్)


ఆవాల రాము(ఫైల్)

దత్తిరాజేరు: మండలంలోని కె.కొత్తవలస కూడలి వద్ద జాతీయ రహదారిపై బుధవారం ఉదయం క్యారియర్ వ్యాన్ ఢీకొనడంతో బైక్‌పై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ఈ మేరకు ఎస్.బూర్జవలస ఎస్సై రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం పార్వతీపురం నుంచి విజయనగరం వస్తున్న క్యారియర్ వ్యాన్ తాడెందొరవలస నుంచి బైక్‌పై కె.కృష్ణాపురంలో బంధువుల ఇంట్లో బారసాల ఫంక్షన్‌కు వెళ్తున్న ఆవాల రాము (55), తట్టుబోను లక్షణరావు(24)లను ఢీకొట్టడంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడు రాముకు భార్య కొండమ్మ ఇద్దరు కుమారులు ఉన్నారు. అవివాహితుడైన లక్షణరావుకు తల్లి అప్పలకొండ, అన్నయ్య శంకరరావు ఉన్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం విజయనగరంలోని సర్వజన ఆస్పత్రికి తరలించి మృతికి కారణమైన ద్వారపూడి గ్రామానికి చెందిన వ్యాన్ డ్రైవర్ శిడగం రాంబాబుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పాము కాటుతో విద్యార్థిని మృతి


మౌనిక (ఫైల్)

గుర్ల: మండలంలోని బూర్లిపేటలో ఇంటర్మీడియట్ మొదటి ఏడాది చదువుతున్న విద్యార్థిని పాము కాటుతో బుధవారం మృతిచెందింది. ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. బూర్లిపేటకు చెందిన ద్వారపూడి మౌనిక (16) మంగళవారం సాయంత్రం ఇంటి ఆరు బయట ఉన్న వరండాలో కుర్చీలో కుర్చుని సెల్‌ఫోన్ చూసుకుంటూ కుర్చీ కింద ఉన్న నాగుపామును గమనించలేదు. ఇంతలో మౌనిక కాలిపై పాము కాటువేసింది. పాము కాటువేసిన సంగతి కుటుంబసభ్యులకు తెలియజేయడంతో ఆస్పత్రికి తీసుకువెళ్తుండగా మార్గమధ్యంలో మృతిచెందింది. మౌనిక నెల్లిమర్ల సీకేఎంజీజే కాలేజీలో ఇంటర్మీడియట్ మొదటి ఏడాది చదువుతోంది. కూతురు ఆకాల మరణంతో తల్లిదండ్రులు కన్నీరుమన్నీరయ్యారు. ఫిర్యాదు మేరకు గుర్ల ఎస్సై నారాయణరావు బుధవారం కేసు నమోదు చేశారు.

యువకుడి అదృశ్యం


అలివెల్లి రాజా

పార్వతీపురం రూరల్: పార్వతీపురం పట్టణంలోని జగన్నాథపురం ప్రాంతానికి చెందిన అలివెల్లి రాజా (25)అనే యువకుడు బుధవారం ఉదయం నుంచి ఆచూకీ లేవకపోవడంతో తండ్రి శ్రీనివాసరావు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పార్వతీపురం టౌన్ ఎస్సై గోవిందరావు పేర్కొంటూ ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గోతులు చూడండి.. చేపలు పట్టండి..



• క్రీడా మైదానంలో గోతులు తవ్వేసి వదిలేయడంపై క్రీడాకారుల ఆగ్రహం
• మైదానం గోతుల్లో చేపలు వదిలి నిరసన

జయపురం విక్రమ క్రీడా మైదానంలో వ్యవసాయ యంత్రమేళా ముగిసిన తర్వాత టెంట్లు కోసం తవ్విన గోతులు పూడ్చకపోవడంపై స్థానిక క్రీడాకారులు మండిపడ్డారు. అధికారుల తీరుకు నిరసనగా గోతులను నీటితో నింపి అందులో చేపలు వదిలి.. పట్టుకోవాలంటూ పిలుపునిచ్చారు. ఫిబ్రవరి 27న మేళా ప్రారంభించి ఈ నెల 3 వరకు కొనసాగించారని, కార్యక్రమం ముగిసిన తర్వాత గోతులు కప్పివేయకపోవడం తగదన్నారు. ఇప్పటికైనా గోతులు కప్పకపోతే వ్యవసాయ కార్యాలయం ముందు ధర్నా చేస్తామని క్రీడాకారులు హెచ్చరించారు.

జయపురం